# దట్ వుమన్ ఫ్రమ్ రష్యా



**చా**లా రోజుల తరువాత మా కాలనీలో మళ్ళీ సంచలనం కనిపించింది. శాయిరామ్. రెడ్డి, గోపాల్రావు, జనార్ధన్ హడావుడిగా మా ఇంటికొచ్చేరు పొద్దున్నే....

"ఏమిటి సంగతి?" భయంగా అడిగాను.

అప్పటికప్పుడు కాలనీ మీటింగ్ అంటారేమో, బంగారం లాంటి ఆదివారం సర్వనాశనం అయిపోతుందేమో అన్న అనుమానం కలిగింది మరి.

"త్వరగా రెడీ అవ్! మనందరం ఏరోడ్రోమ్‌కెళ్ళి ఎల్వీరా ఓజోలినాని రిసీవ్ చేసుకోవాలి" అన్నాడు జనార్ధన్.

"ఎల్వీరా ఓజోలినా నా?"

"అవును"

"అంటే ఏమిటిది?"

"గ్రామర్ మిస్టేక్! ఎవరు అనడగాలి"

"సరే! ఎవరు?"

"రష్యన్ యూనివర్సిటీ ప్రొఫెసర్."

"అతన్ని మనం రిసీవ్ చేసుకోవటమెందుకు?" అయోమయంగా అడిగాను.

"మళ్ళీగ్రామరు– ఆమె అనాలి అతనుకాదు"

"సరే– ఆమెను మనం ఎందుకు రిసీవ్ చేసుకోవాలి?"

"ముందు ఎయిర్‌పోర్టుకి బయల్దేరు! తర్వాత చెప్తాను" అన్నాడు రంగారెడ్డి. ఇంక లాభం లేదని డ్రస్ చేసుకుని వాళ్ళతో బయలుదేరాను. తోవలో వివరాలు అందించాడు రెడ్డి.

ఎల్వీరా ఒజోలీనా మనదేశంలోని తెలుగుజాతి గురించి రిసెర్చ్ చేసి ఓ పుస్తకం రాయాలని ఇండియా వచ్చిందట. ఢిల్లీలో జాబ్ చేస్తోన్న జనార్ధన్ అన్నయ్యకు స్నేహితుడయిన జక్కన్‌లాల్ మక్కన్‌లాల్ ఆమెను తెలుగుదేశం రాజధానిలో గడపమని పంపుతూ, ఆమెను మాకాలనీ అతిథిగా భావించాల్సిందిగా జనార్ధన్‌కు టెలిగ్రామిచ్చాడట! ఇదీ ఫ్లాష్‌బాక్ కథ.

విమానం రెండు గంటలు ఆలస్యంగా చేరుకుంది. ఎల్వీరా ఓ జోలినాను గుర్తుపట్టడం తేలిగ్గా జరిగింది. తనను తాను పరిచయం చేసుకున్నాక మా అందరినీ కూడా పరిచయం చేశాడు జనార్ధన్.

"శాయీరామ్" అన్నాడు శాయీరాంని పరిచయం చేస్తూ.

ఓ! శాయీరామోవ్! అందామె ఆప్యాయంగా కరచాలనం చేస్తూ.

శాయీరాం ఖంగారుపడి అటూ ఇటూ చూశాడు

"మావో గీవో అనకండి పోలీసులు నన్ను కాల్చిపారేస్తారు" అన్నాడు గొంతు తగ్గించి రహస్యంగా

"వ్వాట్? పోలీసుల కాల్చివేయుదురా! ఎందులకు?" అడిగిందామె తను నేర్చుకున్న ప్యూర్ తెలుగు ప్రయోగిస్తూ

"ఏమోనండీ! ఎందుకో ఎవ్వరికీ తెలీదుగాని అలాంటి పేర్లు వినబడినా, పుస్తకాలమీద కనబడినా కాల్చిపారెయ్యడం మాత్రం ఖాయం!"

"వెరీబాడ్!" అందామె.

"అలావాళ్ళను 'వెరీబాడ్' అని ఇంకో రెండుసార్లన్నారంటే మిమ్మల్ని కూడా కాల్చిపారేస్తారు" అన్నాడు రెడ్డి.

ఆమె కొంచెం భయపడినట్లుంది. ఎందుకంటే ఆ తరువాత గోపాల్రావ్ పేరు పలికేప్పుడు "గోపాల్' అని ఊరుకుంది.

జనార్ధన్ టాక్సీ పిలిచాడు.

"మీటర్ మీద హండ్రెడ్ రుపీస్ ఎక్స్ట్రా!" అన్నాడు టాక్సీవాడు, టాక్సీ మా దగ్గరకు లాక్కొచ్చి.

"వ్వాట్, మీటర్మీద హండ్రెడ్ రుపీస్ ఎక్స్ట్రా! ఎందుకు? ఇక్కడ టాక్సీలకు కరువా?" అడిగింది ఎల్వీరా డ్రైవర్ని.

"టాక్సీలకు కరువుకాదుగానీ ఫారిన్ టూరిస్టులకు కరువు మేడం!" అన్నాడువాడు.

"వాటీజ్దిస్ నాన్సెన్స్! వీళ్ళ ఇష్టమొచ్చినట్లు చార్జ్ చేస్తుంటే మీ గవర్నమెంట్ ఏమి చేయుచున్నాది?" అంది ఆశ్చర్యంగా.

"గవర్నమెంటా? వాట్ గవర్నమెంట్?" తనూ ఆశ్చర్యపోతూ అడిగాడు రెడ్డి. ఆ ప్రశ్నకు ఎల్వీరా ఉలిక్కిపడింది.

"అంటే– ఇక్కడ గవర్నమెంటు అనేదే లేదా?" అంది అందరివంకా చూస్తూ! రెడ్డి ప్రశ్నార్థకంగా శాయీరామ్ వేపు చూశాడు. శాయీరామ్ గోపాల్రావు వంకచూశాడు. గోపాల్రావ్ నావంక చూశాడు. నిజానికి గవర్నమెంట్ అనేది ఉందో లేదో నాకూ తెలీదు. ఎందుకంటే ధరలు పెరిగాయని నేనీమధ్య న్యూస్ పేపర్ కొనటం మానేశాను.

"ప్రస్తుతం ఉందో, లేదో తెలీదు మేడమ్! మా ఆఫీసులో కొలీగ్స్ని అడిగిరేపు ఇన్ఫర్మేషన్ ఇస్తాను" అన్నాను బిడియంగా.

ఎల్వీరా నిర్ఘాంతపోయింది.

"వ్వాటేపీపుల్ యూ ఆర్! గవర్నమెంటు ఉందో లేదో కూడా తెలీదామీకు? మీరు ఎలక్షన్లో ఓటు చేయటం లేదా!"

"ఇంతవరకూ ఓటెలా ఉంటుందో మాకెవ్వరికీ తెలీదండీ! మమ్మల్నెవ్వరూ ఎప్పుడూ ఓటు వేయమని అడగరు. ఒకవేళ అడిగిన మేము వేసే లోగానే ఇంకెవరో వేసేస్తారు"

"మరి ఇంకెవర్ని అడుగుతారు?"

"బలహీనవర్గాల కాలనీవాళ్ళనూ, గూడెంలో వాళ్ళనూ, ఇంకా ఇతర బీదా బిక్కీలనూ, చదువురానివాళ్ళనూ అడుగుతారండీ!"

ఎల్వీరీ వెంటనే తన పుస్తకం తీసి "తెలుగు ప్రజలలో బడుగువర్గాల ప్రజలే ఎలక్షన్లలో పాల్గొంటారు. మిగతా ప్రజలకు అసలు ప్రభుత్వం ఉందోలేదో కూడా తెలీదు' అని రాసుకుంది. అది చదివి మేము మొఖమొఖాలు చూసుకున్నాం.

టాక్సీలో బయలుదేరాం అందరం.

అబిడ్స్కి చేరుకున్నాక "ఈ టాక్సీ మెయిన్ రోడ్ మీద నుంచి నడపకుండా ఇలా సందుల్లోంచి నడుపుతున్నాడేమిటి?" అనడిగింది ఎల్వీరా.

"ఇది సందుకాదండీ! మెయిన్రోడ్డే!" అన్నాడు రెడ్డి.

"వ్వాట్! ఇది మెయిన్‌రోడ్డా?"

"అవునండీ!"

"మరి వెహికల్స్ ఇలా ఇష్టమొచ్చినట్లు నడుతున్నారేమిటి?"

"ఇక్కడింతేనండీ! ఇలాగే మా కలవాటు!" అన్నాడు శాయిరామ్.

ఆమె వెంటనే తన పుస్తకం తీసి "తెలుగు ప్రజలు రోడ్ల మీదనడవడం నడపటం చేతకానివాళ్ళు"అని రాసుకుంది.

మేమావాక్యం చదవనట్టునటించాం. టాక్సీ కొంతదూరం వెళ్ళి ఠక్కున ఆగిపోయింది. రోడ్డుకడ్డంగా కట్టిన షామియానాలో వివాహం జరుగతోంది.

"ఏమి జరిగింది?" అడిగింది ఎల్వీరా.

"రోడ్డు బ్లాక్‌చేసి పెళ్ళి జరిపిస్తున్నారెవరో..."

"పబ్లిక్‌రోడ్ బ్లాక్‌చేసి మారేజ్ చేస్తూంటే ట్రాఫిక్కంతా ఏమవుతుంది?" ఆశ్చర్యంగా అందామె.

"మా తెలుగు రాష్ట్రంలో ఇలాంటివెవరూ పట్టించుకోరు! ఎవరు ఏ రోడ్ కావాలంటే ఆ రోడ్‌ని మూసేసి వాడుకోవచ్చు."

"మరి మీ మునిసిపల్ కార్పొరేషన్ ఏం చేస్తుంది?"

శాయిరామ్ పకపకానవ్వాడు.

"భలేవారే మీరు! అసలు కార్పొరేషన్‌వాళ్ళే రోడ్లు తవ్వేసి మధ్యలో పెద్ద ఆర్చీలు కట్టి ఫలానా ఎంకిగాడికి స్వాగతం అని రాస్తుంటారు– అన్ని రోడ్లమీదా! అలా రోడ్లు అన్నీ సగం బ్లాక్ అయ్యే వుంటాయ్ ఎప్పుడూను!"

ఎల్వీరా ఠక్కున తన పుస్తకం తీసి "తెలుగు ప్రజలు మెయిన్ రోడ్లు బ్లాక్‌చేసి పెళ్ళిళ్ళు జరుపుట, "ఎంకిగాడికి స్వాగతం" బోర్డులు కట్టుట చేయుదురు."

అని రాసుకుంది. అంత చిన్న విషయం కూడా ఎందుకు రాసుకుంటోందా అని మేము సైగలు చేసుకుని ఆమె తెలివితక్కువతానికి నవ్వుకున్నాము.

టాక్సీ వెనక్కు నడిచి అయిదు కిలోమీటర్లు ఎక్కుదూరం తిరిగి మా కాలనీకి చేరుకుంది.

కాలనీ చివరి ఇంటిదగ్గర బోలెడుమంది గుమికూడి ఉండటం చూచింది ఎల్వీరా.

"అక్కడెందుకు అంతమంది గుమిగూడారు?" అడిగిందామె.

"న్యూస్‌పేపరు కోసం! మా కాలనీలో ఆ చివరింటాయన ఒక్కడే న్యూస్‌పేపర్ తెప్పిస్తాడు. మిగతా అందరూ ఆయన దగ్గర తీసుకుని చదువుతారు" చెప్పాడు జనార్ధన్.

"అదేమిటి? ఎవరి పేపర్ వాళ్ళు కొనుక్కోవచ్చు గదా!"

"కొనుక్కోవచ్చునుకోండి! కానీ అలవాటు లేదు."

ఆమె వెంటనే తన పుస్తకం తీసి- తెలుగువాళ్ళు అందరూ పక్కింటి వాళ్ళపేపర్లూ. మాగజైన్లు చదువుతారు. అని రాసుకుంది.

"భలేగుందే! ఇంత మైన్యూట్ డిటైల్స్ కూడా రాసుకుంటున్నారు" అన్నాడు గోపాల్రావ్ ఆశ్చర్యంగా.

ఆమె చిరాగ్గా చూపింది.

అందరం జనార్ధన్ ఇంటికి చేరున్నాం.

"ముందు నేను స్నానం చేయాలి! బాత్‌రూమ్ ఎక్కడ?" అడిగిందామె.

అందరం ఘొల్లుననవ్వాము.

ఎల్వీరా మమ్మల్ని పిచ్చివాళ్ళను చూసినట్లు చూసింది.

"ఏమిటలా నవ్వుతున్నారు?" అంది టవల్ భుజాన వేసుకుంటూ.

"ఇవాళ ఆదివారం కదా! మరి స్నానం చేస్తానంటారేమిటి? ఇక్కడవారానికి నాలుగు రోజులే నీళ్ళువస్తాయి. అంచేత నాలుగురోజులే స్నానం చేయాలి."

"వాట్? వారానికి నాలుగురోజులేనా?"

"ఒక్కొసారి రెండ్రోజులే వస్తాయ్!"

"వాటే హోప్‌లెస్ పీపుల్ యూ ఆర్!" అందామె చిరాకుగా. అని పుస్తకం తీసి తెలుగు ప్రజలు వారానికి నాలుగు రోజులే స్నానం చేయుదురు అని రాయబోయింది గాని శాయీరామ్ అడ్డుపడ్డాడు.

"దయచేసి అదంతా రాయకండి! ఎందుకంటే నేను చెప్పేది వేసవిలో సంగతి. అదీగాక తెలుగు ప్రజలు ఇంకా నయమండి! తమిళ ప్రజలు వారానికి మూడుసార్లే చేస్తారు" అన్నాడు రెడ్డి.

అందరం తలోకొంచెం నీళ్ళుదానం చేశాము- ఆమె స్నానానికి.

మా అందరికీ గోపాల్రావ్ వాళ్ళింట్లోనే భోజనం ఏర్పాటు చేశాడు.

"కేవలం తెలుగుభోజనమే తింటాను" అని ముందే ఎల్వీరా చెప్పటం చేత తెలుగు వంటకాలే చేయించారు.

ఎల్వీరా అన్నం మొదటి ముద్దనోట్లో పెట్టుకోగానే పటపటమన్న శబ్దాలు వినిపించాయ్.

"స్టోన్స్" అంటూ అరచి బయటకు పరుగెత్తి అన్నం ఊసివేసిందామె

"ఈవిడ వ్యవహారం మరీ విడ్డూరంగా ఉందే! బియ్యంలో రాళ్ళు ఉండకుండా ఎలా ఉంటాయ్?" అన్నాడు గోపాల్రావ్ రాళ్ళుమింగేస్తూ.

"అన్నంలో రాళ్ళు మామూలు విషయమేనండీ! ఖంగారుపడవద్దు!" చెప్పాడు రెడ్డి.

"నో నో! నావల్లకాదు. నాకు బ్రెడ్ తెప్పించండి!" అందామె.

"బ్రెడ్‌లో కూడా రాళ్ళుంటాయ్!" అన్నాడు జనార్ధన్.

"ఇలా అన్నిట్లో రాళ్ళు కలుపుతుంటే మీ గవర్నమెంట్ ఏం చేస్తోంది?"

"గవర్నమెంట్ ఏమిటి?" మళ్ళీ ఆశ్చర్యంగా అడిగాడు రెడ్డి.

ఆమె రెండు చేతలతో తల పట్టుకూర్చుంది.

"రుక్మిణీ" అంటూ భార్యను పిలిచాడు గోపాల్రావ్.

"ఏమిటండీ!" చేతులు తుడుచుకుంటూ వంటింట్లో నుంచి వచ్చిందామె. "నువ్వు నిన్న పక్కింట్లోనుంచి పేపర్ తెచ్చి చదివినట్లున్నావ్ కదా! గవర్నమెంట్ ఉందీలేందీ ఏమయినారాశారా అందులో?"

"భలేవారే! గవర్నమెంట్ లేకపోవటం ఏమిటి? ఉందని జనార్ధన్ అన్నయ్యగారి భార్యకూడా అంది నిన్న."

"ఏది– ఆవిడనోసారి పిల్చుకురండి! సరిగ్గా కనుక్కుందాం!" అన్నాడు జనార్ధన్.

జనార్ధన్ భార్య రెండు నిమిషాల్లో వచ్చింది.

"ఏమే? రుక్మిణమ్మగారితో నువ్వు గవర్నమెంట్ ఉందన్నావా?" అడిగాడు జనార్ధన్.

"అవునూ! ఏం?"

"నీకెలా తెలుసే ఆ విషయం?"

"బాగుందండీ! రోజు రోజుకీ ధరలు పెరిగిపోతూంటే తెలియటం లేదూ? గవర్నమెంట్ లేకపోతే ధరలెలా పెరుగుతాయ్?"

"నిజమే!" ఒప్పుకున్నాడు శాయీరామ్.

"ఓ! అయితే గవర్నమెంట్ ఖచ్చితంగా ఉందన్నమాట!" అంది ఎల్విరా. ఆమె రెండు అరటి పళ్ళుతిని చేయి కడుక్కుంది. మధ్యాహ్నం వరకూ తెలుగు ప్రజల గురించి ఎన్నో ప్రశ్నలు వేసి వివరాలు సేకరించిందామె.

(1) భర్తలను పశువులసంతలోపలె కొనుక్కొనుట వీరి ఆచారము.

(2) మతాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నో పిల్లలను కనుట వీరి ఆచారము. (3) ....

ఇలా చాలా విషయాలు అమెరాసుకుంటూటే నేను దొంగతనంగా చదివాను. (అవన్నీ మరోసారి మనవి చేసుకుంటాను. ఆ మధ్యాహ్నం మా ఇంట్లో టీ పార్టీ.

టీ తాగుతుండగా కాలనీ మధ్యవరుసలోని ఇంట్లో పెద్ద కేకలు వినిపించినయ్. మరుక్షణం కాలనీలో చాలామంది అక్కడకు పరుగెత్తారు.

మేమూ, ఎల్వీరాకూడా అక్కడకు చేరుకున్నాం. సంగతేమిటో మాకు ముందుగానే తెలిసిపోయింది.

కిరాతకరావు తన భార్యను రోజూ చావగొట్టడం కాలనీలో అందరికీ తెలిసిన విషయమే!

ఆమెను పుట్టింటి నుంచి ఏవేవో ఖరీదయిన వస్తువులు తెమ్మని అతనూ, వాళ్ళమ్మా నానాహింసలు పెడుతుంటారు.

మేము వెళ్ళేసరికి పూర్తిగా కాలిపోయిన కిరాతకరావు భార్య శరీరాన్ని గది తలుపులు పగులగొట్టి బయటకు తీసుకొచ్చారు కొంతమంది.

మరికాసేపట్లో టాక్సీమీద చావుబ్రతుకుల మధ్య ఊగిలాడుతున్న ఆమెని హాస్పిటల్‌కి తీసుకెళ్ళారు.

"వాట్ హాపెన్డ్?" అందోళనపడుతూ అడిగింది ఎల్వీరా.

"ఆ! మామూలే! కొత్తగా పెళ్ళయింది. భార్యను చంపేస్తే, మళ్ళీ బోలెడు కట్నం తీసుకుని పెళ్ళి చేసుకోవాలని అలా చేస్తున్నాడు" చెప్పాడు జనార్ధన్.

"మైగాడ్! మీ వాళ్ళు మనుషులా? జంతువులా?" ఆవేశంగా అడిగింది. మేము మాట్లాడలేదు.

ఇంటికి చేరుకోగానే పుస్తకంతీసి "తెలుగు ప్రజలలో చాలామందికి భార్యలను కిరసనాయిలు పోసి తగలబెట్టుట ఆచారము." అని రాసుకుంది. మరి కాసేపు మిగతా ఆచారాల గురించి తనకు తెలియని విషయాలు వివరంగా చెప్పాడు శాయిరామ్.

"మీ తెలుగు సినిమా ఒకటి చూడాలి ఇవాళ!" అందామెకాసేపాగి.

"ఓ యస్! మేమూ సినిమా చూసి చాలా రోజులయింది పదండి!" అన్నాడు గోపాల్రావ్. అందరం రోడ్డుమీదికొచ్చాం. టాక్సీఖాళీగా కనిపించింది. శాయిరాం డ్రైవరుతో మాట్లాడాడు.

"చాలిస్ రూపయాదేదో!" అన్నాడు టాక్సీవాడు.

"నలభైఎందుకు? పదిహేనిస్తా!"

"పంద్రా? పంద్రా రూపయా? హమ్ భీక్‌మాంగ్‌సేవాలోంకో దేతే–"

"అతను మాట్లాడేది ఏ భాష?" అనడిగింది ఎల్వీరా.

"ఊర్దూ!"

"ఓ! ఐసీ!"

అందరం బస్‌స్టాపులో నిలబడ్డాం

బస్సువచ్చి ఆగింది.

ఫుట్‌బోర్డు మీద యాభయ్ మంది వేలాడుతున్నారు.

బస్సు లోపల మాత్రం అన్ని సీట్లూ ఖాళీగా ఉన్నాయి.

మేము ఆ ఫుట్‌బోర్డుమీద జనాన్ని తోసుకుంటూ లోపలికెక్కడానికి ప్రయత్నించాంగానీ మా వల్లకాలేదు. బస్సువెళ్ళిపోయింది.

"వాటీజ్‌దిస్? లోపలఖాళీ ఉండగా వీళ్ళంతా ఫుట్‌బోర్డు మీదే ఎందుకు నిలబడ్డారు?"

ఆశ్చర్యంగా అడిగిందామె.

"ఫుట్‌బోర్డ్ ట్రావెలింగ్ మా కాపిటల్ ప్రజలహాబీ! అందుకే త్వరలో కేవలం ఫుట్‌బోర్డులతోనే కొత్తరకం బస్సు తయారు చేస్తున్నారు" చెప్పాడు రెడ్డి.

ఆమె వెంటనే తన పుస్తకం తీసి "ఫుట్‌బోర్డు మీద ప్రయాణించుట తెలుగు ప్రజల హాబీలలో ఒకటి" అని రాసుకుంది.

మరో రెండుబస్‌లు ఆగకుండా పోతూనే ఉన్నాయ్. చివరకు ఓ బస్ ఆపాడు.

"కిదర్‌జానా?" అడిగాడు కండక్టరు.

"నారాయణ్‌గూడా."

"కిత్నేటికెట్?"

"ఛే టికెట్–" అంటూ పది రూపాయల నోటు ఇచ్చాను. కండక్టర్ నోటువంక చూసి చిరునవ్వు నవ్వి నాచేతికి నాలుగు రూపాయలు ఇచ్చి వెళ్ళిపోయాడు.

"వాటెబౌట్ టికెట్స్?" అంది ఎల్వీరా ఆశ్చర్యంగా.

"సాధారణంగా ఇక్కడ టికెట్లివ్వరులెండి! దీసీజ్ నార్మల్" ఫ్రాంక్‌గా చెప్పేశాను.

"ఓ మైగుడ్‌నెస్!"

అందామె ఆశ్చర్యంగా. ఆ తరువాత ఆరష్‌లోనే పుస్తకం తీసి ఏదో రాసుకుంది.

"తెలుగువాళ్ళు అవినీతిపరులు అని రాసుకుందేమో!" అన్నాడు శాయిరామ్ నా చెవిలో. సినిమా హాలుకి చేరుకున్నాం.

"ఈ హీరో పేరేమిటి?" హాల్ బయటవున్న పెద్దకట్ అవుట్‌ని చూస్తూ అడిగిందామె.
"రాజేష్‌కుమార్! తెలుగులో సూపర్‌స్టార్! అతను నటించిన సినిమాలకు ఎన్నో అవార్డులు వచ్చాయ్" చెప్పాడు రెడ్డి.

"ఓ ఐసీ! ఏం సినిమాలవి?" కుతూహలంగా అడిందామె.

"అల్లుడే మేనత్తమొగుడు! సింహం రక్కింది! దగుల్బాజీ వెధవ..."

"ఆగండాగండి!" అరిచిందామె.

"ఏమిటి?" అడిగాడు జనార్ధన్ ఆగి.

"అల్లుడే మేనత్త మొగుడు! అంటే ఏమిటి?"

"అంటే... అంటే సన్ ఇన్లా ఓన్లీ ఈజ్ ఆంట్స్ హజ్‌బెండ్."

"అంటే?" మళ్ళీ అడిగిందామె.

"అంటే... అంటే.. అదే!"

"కానీ అదెట్లాకుదురుతుంది? మీ తెలుగులో ఆ వరుసలు ఉండవుగా?"

"అబ్బే– అలాంటివేమీ చూడరండీ మా వాళ్ళు! టైటిల్ కొత్తగా ఉండాలి– ప్రాస

కుదరాలి! అంతే."

"మిగతా అవార్డు ఫిలిమ్స్ ఏమిటి?"

"సింహం రక్కింది- దగుల్బాజీ వెధవ- తీటగాడు."

"దగుల్బాజీ! వాటీజ్ దగుల్బాజీ-"

"అంటే వట్టిరోగ్ అన్నమాటండీ!"

"వెధవ అంటే?"

"అంటే వట్టివెధన అని అర్థం."

గోపాల్రావ్ టికెట్లు తీసుకొచ్చాడు.

"తీటగాడు అంటే ఏమిటి?" అడిగింది ఎల్విరా.

"అంటే- అంటే తీటగాడేనండీ" ఆలోచింది చెప్పాడు జనార్ధన్.

అందరం హాల్లోకెళ్ళి కూర్చున్నాం.

సినిమా టైటిల్స్ వస్తున్నాయి.

వక్రవీర ప్రొడక్షన్స్ సమర్పించు- 'తెడ్డిపాలెం గిడ్డిగాడు' అన్న అక్షరాలను అతి కష్టం మీద చదివింది ఎల్వీరా.

"తెడ్డిపాలెం గిడ్డిగాడు అంటే ఏమిటి?" అడిగిందామె రెడ్డిని.

రెడ్డి ఓ క్షణం ఆలోచించి " ఆపేరుకి అర్థం ఏమిట్రా?" అంటూ శాయీరామ్ని అడిగాడు. శాయీరామ్ రహస్యంగా నన్నడిగాడు.

నేను రెండు నిమిషాలు ఆలోచించి "తెడ్డిపాలెం అంటే ఓ ఊరన్నమాట! అందులో గిడ్డిగాడు! అదీ సంగతి" అని చెప్పాను.

"ఓ! కాని, గిడ్డిగాడు అంటే ఏమిటి" మళ్ళీ అడిగిందామె.

నాకేం చెప్పాలో తెలీలేదు. "గిడ్డిగాడూ... మీన్స్... మీన్స్... " అని గోపాల్రావ్ వేపు చూశాను.

"గిడ్డిగాడంటే .... ఇది" అన్నాడు గోపాల్రావ్ సరయినపదం కోసం వెతుకుతూ

"ఇదంటే?"

"ఇదంటే అదే- ఇది! నిజం చెప్పాలంటే నాకూ సరిగ్గా తెలీదు" అనేశాడు చివరకు.

"అయ్ టూ డోన్ట్నో!" అన్నాడు జనార్ధన్.

"వ్వాట్! గిడ్డిగాడు- తెలుగుపదమే కదా!" అడిగింది ఎల్వీరా.

"ఆఫ్కోర్స్ ఆఫ్కోర్స్" అన్నాం అందరం!

"మరి మీ మదర్టంగ్ తెలుగయి ఉండి ఓ తెలుగు పదానికి అర్థం తెలీదా? వెరీబాడ్!" అందామె పుస్తకంం తీస్తూ.

"ఆగండాగండి! నిజానికిది తెలుగుకాదండీ?"

"మరే భాష?"

"అసలే భాషాకాదండీ! అర్థంలేని మాట."

"మరి ఈ సినిమాకు అవార్డు కూడా వచ్చిందన్నారు. సిల్వర్ జూబ్లీ ఫిలింఅన్నారు– ఇలాంటి సినిమాకు అర్థంలేని పిచ్చిపేరు ఎలా పెట్టారు?

"మా తెలుగు సినిమాలు అంతేనండీ! సాధారణంగా టైటిల్‌కి అర్థం ఉండదు" ఆమె వెంటనే పుస్తకంలో ఏదేదో రాసుకుంది.

"ఇందాక 'సింహం రక్కింది' అనేది మరో అవార్డ్ పిక్చరన్నారుకదా! దానర్థం ఏమిటి?"

"అంటే హీరో సింహం అన్నమాటండీ! అతను అందరినీ రక్కేస్తూంటాడు?"

"అంటే అడవిమనిషా?"

"కాదనుకోండి! నాగరికుడేగానీ రక్కేస్తుండటం వాడికిష్టం!"

"కానీ చేతుల్తో మామూలుగా ఫైట్ చేయవచ్చు కదా! రక్కటం ఎందుకు?"

"టైటిల్ ఎలా వుంటే ఆలా చేస్తారండీ మా తెలుగు హీరోలు! చెయ్యకపోతే జనం చూడరు!"

"అవునండీ! వేటకుక్క అనే పిక్చర్లో మొదట్నుంచీ చివరివరకూ హీరో విలన్లు అందరినీ కుక్కలా కరుస్తూనే ఉన్నాడు. 'రాబందురాక్షసి' సినిమాలో హీరో నోటితో అందరినీ చీల్చితినేశాడు. 'భల్లూక భస్మం' సినిమాలో హీరో భల్లూకంలా నడిచి గోళ్ళతో రక్కుతుంటాడు."

"వెరీ స్ట్రేంజ్" అందామె తన పుస్తకం తెరుస్తూ.

"తప్పదండీ! ఆడవి మృగాల పేర్లకే ఎక్కువగిరాకి! వాటికోసమే జనం ఎగబడతారు గానీ మా హీరోలకోసం కాదు" సిగ్గుపడుతూ చెప్పాడు గోపాల్రావ్. ఆమె పుస్తకంలో ఏదో రాసేసింది.

సినిమా మొదలయింది.

హీరో విలన్లు ఫైటింగ్ మొదలు పెట్టారు.

"ఏమిటి వాళ్ళెందుకలా కొట్టుకుంటున్నారు?" ఆత్రుతగా అడిగింది ఎల్వీరా.

"సాధారణంగా ఫలానా కారణం అంటూ ఏమీ ఉండదు. ప్రతి పావుగంటకూ ఓ ఫైటింగు ఉండటం మామూలే! ఆ ఫైట్స్ లేకపోతే జనం చూడరు."

ఆసీనయిపోయింది.

హఠాత్తుగా హీరో హీరోయిన్ వెనుకపడి పాట మొదలెట్టాడు.

"వంగతోటలో వంగమాకు– దొండతోటలో పడబోకు రెండూ జాగ్రత్త పిల్లా..."

జనం కుర్చీల్లో నుంచి తప్పట్లు కొట్టారు.

"వాటీజ్‌దట్?" ఆశ్చర్యంగా అడిగింది ఎల్వీరా.

"ఆపాట సాహిత్యం వాళ్లకు నచ్చిందికాబోలు..." అన్నాడు శాయిరామ్.

"దానర్థం ఏమిటో?"

మాకేం చెప్పాలో తెలీదు.

"అది డబుల్ మీనింగ్ సాహిత్యం"

"అంటే?"

"అంటే రెండర్థాల సాహిత్యం అన్నమాట! ఒకటి మంచిది రెండోది బూతు"

"మైగుడ్‌నెస్! అలాంటి సాహిత్యం మీ తెలుగు ప్రేక్షకులు విని ఆనందిస్తారా?"

"అందరూ కాదండీ! చాలామంది.... " ఆమెను సరిచేశాడు జనార్ధన్.

"మరి అలాంటి చెత్తసాహిత్యం మీ గవర్నమెంట్ బాన్‌చేయదా!"

"గవర్నమెంట్ ఉందోలేదో ఖచ్చితంగా తెలీదుకదండి– రేపు మా ఆఫీసులో అడిగిచెప్తా"

"అయినా అది సెన్సార్ వాళ్ళు చేయాల్సినపని కాదా" అన్నాడు రెడ్డి.

"మరి చేయరే" అడిగింది ఎల్వీరా.

"వాళ్ళకి పాపం సాహిత్యం తెలియదండీ! అసలు చాలామంది సెన్సార్‌మెంబర్లకి తెలుగుకూడా రాదు! వచ్చిన కొద్దిమందీ కూడా బూతు యాక్షనే అభ్యంతరకరమయిన సాహిత్యం అనుకుంటారు."

"అదేమిటి? అంత తెలివితక్కువ వాళ్ళను సెన్సార్ మెంబర్లుగా ఎలావేస్తారు?"

"అది సరిగ్గా తెలీదుగానండీ, మొత్తానికి అలాగే మానేజ్ చేస్తారు."

మరికొంత సినిమా అయింది.

హఠాత్తుగా జనం పెద్ద ఎత్తున హర్షధ్వానాలు చేశారు.

"వాటిజ్‌దట్! వాట్ హేపెన్డ్?" ఆశ్చర్యంగా అడిగింది ఎల్వీరా. "మరేం లేదు! కెమెరా హీరోయిన్ బొడ్డుమీద ఫోకస్ అయింది అందుకని."

వాటే ఫోర్నోట్రైబ్ యూ ఆర్..." అసహ్యంగా మొఖం పెట్టి అందామె. మరుక్షణంలో హీరో గ్రూప్‌డాన్స్.

"జజ్జనకా జన్! జింగినక..." మళ్ళీ ప్రేక్షకులు తప్పట్లూ ఈలలు.

"ఏమిటి ఈచరణానికి అర్థం?" అడిగింది ఎల్వీరా.

"దీనిక్కూడా అర్థం ఏమీలేదండీ!

"మరి వాళ్ళలా తప్పట్లూ, ఈలలు ఎందుకు వేస్తున్నట్లు?"

"ఏమో తెలీదుగానీ ఎప్పుడూ ఇలాంటి పాటలకు వేస్తుంటారు."

"అంటే మీ తెలుగు పాటలు సాహిత్యమంతా బూతుగానీ, అర్థంలేని మాటలతో గానీ ఉంటుందన్నమాట! మరి నేను చదివిన పుస్తకాల్లో తెలుగు కవిత్వాన్ని గురించి అంతగొప్పగా రాశారేమిటి?" అంటూ పుస్తకం తెరచి "తెలుగు ప్రజల సాహిత్యమంతా అర్థంలేనిది. ఒకవేళ అర్థం ఉంటే అది బూతుది." అని రాసుకుంది.

పాట అయిపోయింది.

కామెడీ జంట వచ్చారు.

హీరో ఆమె దగ్గరకెళ్ళి "నాకు అదిస్తావా?" అన్నాడు

జనమంతా ఘొల్లున నవ్వారు.

"ఏమిటి మళ్ళీ నవ్వుతున్నారు?"

"బూతు డైలాగండీ!" సర్దిచెప్తూ అన్నాడా శాయిరామ్.

రెండు నిమిషాలపాటు బూతుమాటలు మాట్లాడాక పాట మొదలయింది.

"మన తనువులు కలిసేదెక్కడ?" పాటలోనే ప్రశ్నించింది హాస్యనటి.

"ఇక్కడా?" అంటూ పెదాలు చూపించాడు కమెడియన్.

"కాదు!" అందామె.

"ఇక్కడా?" అంటూ ఆమె గుండెలు చూపించాడతను. ప్రేక్షకులు మళ్ళీ అరుపులు ఈలలు.

"ఇక్కడా?"

"ఉహు! ఇక్కడ"

అతను చూపించిన శరీరభాగం చూసి మొత్తం హర్షంతో కేకలువేసి డాన్స్ చేసినంతపనిచేశారు. తరువాత సీన్‌లో హీరోయిన్ తాలూకూ చిన్న పాపాయిని చంపటానికి విలన్ అర్థరాత్రి కత్తి తీసుకుని గదిలోకొచ్చాడు. ఈ సంగతితెలసి ఊరి బయటపుట్టలో ఉన్న పాముగంటకు ఎనభై కిలోమీటర్ల వేగంతో పరిగెత్తుకొచ్చి, కిటికీలోనుంచి దూరి, ఉయ్యాల మీదకెగిరి కత్తితో పోడవబోతున్న విలన్ చేతిని కసుక్కున కాటేసింది.

విలన్ పెద్దగా అరుస్తూ కిందపడ్డాడు. హీరోయిన్ పరుగుతో వచ్చి, ఆదృశ్యం చూసి పాముతల అప్యాయంగా నిమిరి ముద్దు పెట్టుకుంది.

"వాటీజ్‌దిస్ నాన్సెన్స్?" అసహనంగా అడిగింది ఎల్వీరా.

"ఈ సినిమా ఇంకా నయమండీ! గొర్రెపోటేళ్ళు ఎద్దులు, ఆవులు గాడిదలు పిల్లులు, బొద్దింకలు, ఎలుకలు ఇవన్నీ కూడా మా సినిమాల్లో హెూరున యాక్షన్ చేస్తాయండీ! హీరోయిన్‌కిగానీ, హీరోకిగాని సహాయం చేసి విలన్లను చంపిపారేస్తాయ్" చెప్పాడు గోపాల్రావ్.

"మీకు తెలీదనుకుంటాను. ఈ మధ్యనో తెలుగు పిక్చర్లో హీరోయిన్ రెండు తూనీగల్ని పెంచుతుంది. బాత్‌రూమ్ కెళ్ళినా– కాలేజీ కెళ్ళినా ఎప్పుడూ ఆమెనే అంటిపెట్టుకుని ఉంటాయన్నమాట అవి! ఓ విలన్ సినిమా అంతా ఆమెని నానాబాధలు పెడుతూ చివర్లో రేప్ చేయబోతుంటే ఆ రెండు తూనీగలు ఆవిషయం తెలుసుకుని కోపంగా ఎగిరి విమానాల్లా వాడిని ఛేజ్‌చేసి చివరికి వాడి మీదపడి రెండు కళ్ళూ పీకేస్తాయ్– కేవలం ఆసీనుకోసమే నూట ఇరవై ఆర్రోజులు ఆడింది ఆ సినిమా!" చెప్పాడు శాయీరామ్.

"ఇంక వెళ్దామా?" అడిగింది ఎల్వీరా వాంతి ఆపుకుంటున్నట్లు మొఖం పెట్టి– హఠాత్తుగా హాల్లో వున్న ఆడాళ్ళందరూ వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టారు.

"అరె– ఏమయింది? లేడీస్ అంతా ఎందుకలా ఏడుస్తున్నారు" గాబరాగా అడిగింది ఎల్వీరా!

"ఆడాళ్ళు ఏడవటానికి ఆఖరులో సెంటిమెంట్ సీన్లు పెడతారండీ! భర్తకాళ్ళు కళ్ళకద్దుకుంటూ ఏడ్చేసీన్లు, భర్తామెను చావగొట్టి పీక పిసుకుతున్నా "పతియే ప్రత్యక్షదైవం– ఆదైవం కాదంటే ఉరియే అత్యంత ప్రియం" అని పాడటం. తననొదిలేసి ఇంకో స్త్రీతో సంసారం చేస్తున్న భర్తకోసం, జీవితాంతం పాటలు పాడుతూ ఎదుర్చూడటం, భర్త ఇంకెవర్నయినా ప్రేమిస్తే– తనే వాళ్ళిద్దరికి పెళ్ళిచేయడం ఇలా చాలా బావుంటాయ్ సీన్లు–"

"చాలు! చాలు" అంది ఎల్వీరా వికారంగా మొఖం పెట్టి.

"అయినా మగాడిని ఇక్కడి స్త్రీలు దేవుడు అంటారేమిటి? ఇది నేనెక్కడా చూళ్ళేదు–" అందామె.

"నేను చూశాను" అన్నాడు రెడ్డి తెలుగువాళ్ళను ఆమె ఆలా ఇన్సల్ట్ చేయటం భరించలేక.

"ఎక్కడ?

"ఏమో గుర్తులేదు! పాకిస్తాన్‌లో అనుకుంటాను!" అంటూ తప్పించుకున్నాడు. అందరం హాలు బయటకొచ్చేశాం. రోడ్డుమీద ట్రాఫిక్ అంతా ఆగిపోయివుంది.

"మళ్ళీ ఏమిటి! రోడ్డుమీద పెళ్ళా? చిరాకుగా అడిగిందామె.

గోపాల్రావ్ జనంలోంచి ముందుకు చొచ్చుకెళ్ళి సంగతి కనుక్కొచ్చాడు. ఏదో సబ్బుల కంపెనీవాళ్ళు– కొత్తగా తయారు చేసిన సబ్బు పబ్లిసిటీ కోసం వంద తాబేళ్ళను అలంకరించి రోడ్లుమీద బాండ్‌మేళంతో ఊరేగింపుగా నడిపిస్తున్నారు. పాపం తాబేళ్ళు కొంచెం స్లోకదా! అందుకని ట్రాఫిక్ నిలచిపోయింది. గంటసేపటి తర్వాత తాబేళ్ళు పది గజాల దూరంలో వున్న సెంటర్ దాటాయి.

ఆ తాబేళ్ళ వెనకే వెడుతున్న బస్ ఎక్కాం అందరం.

"ఇలా ఆ సబ్బుల కంపెనీవాళ్ళు ట్రాఫిక్కంతా జామ్‌చేసేస్తుంటే మీ పోలీసులేం చేస్తున్నారు?" అడిగింది ఎల్వీరా.

"పోలీసులా. అవును! నిజమే! పోలీసులేం చేస్తున్నారు?" అన్నాడు రెడ్డికూడా ఆలోచిస్తూ.

"పాపం! పోలీసుల్నేం అనకండి! వాళ్ళకి తీరికేది? మినిష్టర్ల ఇళ్ళకికాపలా వుండాలి కాబరే డాన్సులు రోజూ చూసి, ఎప్పుడయినా ఓసారి కేసులు పెట్టాలి. దగ్గరుండి వీడియోపార్లర్లలో బ్లూ ఫిలిమ్స్ వేయించాలి. ఎవరయినా "వేయం" అని ఎదురుతిరిగితే దొంగకేసులు పెట్టాలి. వాళ్ళ అభిప్రాయాలతో ఏకీభవించని వాళ్ళను 'నక్సలైట్లు' అని అరిచి కాల్చి పారెయ్యాలి. మా బస్ రాత్రి పన్నెండింటికి తాబేళ్ళ ఊరేగింపు ముగిశాక, స్పీడ్‌గా పరుగెత్తి మమ్మల్ని కాలనీకి చేర్చింది.

అందరం రాళ్ళు తక్కువగా వుండే గోధుమ రొట్టెలు తిన్నాం.

"అబ్బ! నిదరొస్తోంది! గుడ్‌నైట్" అంది ఎల్వీరా.

"అప్పుడే గుడ్‌నైట్ చెప్తున్నారేమిటి?" రెండింటివరకూ మేలుకోవాలి కదా!" అన్నాడు గోపాల్రావ్.

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగిందామె.

"రెండింటికి దొంగలొస్తారు ఊరి బయటకాలనీలకు! వాళ్ళొచ్చేటైముకి తులపులు తెరిచి ఆహ్వానించకపోతే కాల్చిచంపేస్తారు."

"దొంగల కోసం తలుపులు తెరిచి ఆహ్వానించాలా. ఎంతఘోరం?"

"ఒకప్పుడు చాలా ఘోరమేననుకోండి! కానీ ఇప్పుడు అలవాటుపోయింది."

"మరి పోలీసులేం జేస్తుం... సారీ! ఇందాకే చెప్పారుకదా!"

రెండింటికి కాలనీలో ఓ ఇంటికి దొంగలొచ్చి వెళ్ళాక- అందరం గుడ్‌నైట్ చెప్పుకుని లేవబోతూంటే బయటినుంచి కేక వినిపించింది.

"పేపరు ఎవరి దగ్గరుంది మాష్టారూ?"

"ఎవరిది?" అడిగింది ఎల్వీరా. ఆ కేక ఎవరువేస్తారో మా అందరికీ తెలుసు. చివరింటి రామచంద్రం తాలూకు రోజువారి కార్యక్రమం అది. మా కాలనీలో అతనొక్కడే న్యూస్‌పేపర్ కొంటాడు. పేపరు రాగానే పక్కింటి అతను తీసుకుంటాడు. ఆ తరువాత ఆ పక్కింటి అతను. అలా తిరిగి తిరిగి ఎక్కడో వుండిపోతుంది. రాత్రి ఎనిమిదింటికి ఆఫీసునుంచి వచ్చాక ఆ పేపర్‌కోసం గాలింపు మొదలుపెడతాడు, రామచంద్రం. ఇంటింటిముందు అరుస్తూ తిరుగుతాడు. కానీ ఇప్పుడా విషయం చెప్తే ఎల్వీరా తన పుస్తకంలో తెలుగు వాళ్ళు పక్కింటివాళ్ళ పేపరు చదవటమే కాకుండా, మళ్ళీ తిరిగి ఇవ్వరు." అని రాసుకుంటుంది. అందుకే మేము నిజం చెప్పలేదు.

"అతనెవరో పిచ్చాడులెండి! రోజూ అలాగే అరుస్తూంటాడు" అని చెప్పాను.

అప్పుడే పోలీస్‌వ్యాన్ ప్రకటనలు చేస్తూ కాలనీలో కొచ్చింది.

"జంట నగరాల్లో మతకల్లోలాలు జరగటం వల్ల రేపు ఉదయం ఆరుగంటల నుంచీ నిరవధికంగా కర్ఫ్యూ విధించడమైనది. ప్రజలందరూ గమనించప్రార్ధన."

"కర్ఫ్యూనా" ఆందోళనగా అడిగింది. "అది మామూలేలెండి. మేము తరచూ కర్ఫ్యూలోనే వుంటాం" అన్నాడు శాయిరామ్.

ఆమె వెంటనే తన పుస్తకంలో, "తెలుగు ప్రజలు ఎక్కువకాలం కర్ఫ్యూలోనే గడుపుదురు." అని రాసుకుంది. "ఇంక నిద్రపోండి" అన్నాడు రెడ్డి.

"నో నో ! నేను ఇప్పుడే ఎయిర్‌పోర్టుకెళ్ళిపోతాను" అందామె.

"అదేమిటి?"

"నా స్టడీ అయిపోయింది. ఇలాంటి నరకంలో ఒక క్షణం కూడా ఉండలేను!" అంది.

అందరం ఆమెతోపాటు ఎయిర్‌పోర్టుకు బయల్దేరాం. టాక్సీవాడు "సౌరుపయా దేనా" అన్నాడు. "అస్సీరుపయా" అన్నాడు గోపాల్రావ్. చివరకు బేరం కుదిరింది.

"తెలుగు ప్రజలు ఉర్దూ మాట్లాడుదురు." అని రాసుకుంది ఎల్వీరా. మేము చూసికూడా చూడనట్లు వూరుకున్నాం.

